క్లుప్తంగా

ఉపాధి పనులు వేగవంతం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో సీతయ్య

చింతపల్లిరూరల్: మండలంలోని అన్ని గ్రామాల్లో ఉపాధి పనులు వేగవంతం చేయాలని ఎంపీడీవో లాలం సీతయ్య అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యలయం లో ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బందితో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. అన్ని గ్రామాల్లో ఉపాధి పనులు వేగవంతం చేయాలని సూచించారు. జాబ్ కార్డులు లేని వారి వివరాలు మంగళవారం నాటికి అందజే యాలన్నారు. ఆధార్‌కార్డులను బ్యాంక్ ఖాతాకు అనుసంధానం చేసి, ప్రతి జాబ్‌కార్డు దారుడు ఉపాధి పనుల్లో పాల్గోనేలా అవగాహన కల్పించాలన్నారు. ఏపీవో కోండబాబు, ఈసీ సంజీవ్, టెక్నికల్ అసిస్టెంట్‌లు, హౌసింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

అరకులోయ రూరల్: మండల కేంద్రంలో వేంకటేశ్వర స్వామి ఆలయంలో కల్యాణోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. స్వామి వారికి బుధవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పూజల్లో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ యువజన విభాగ రాష్ట్ర కార్యదర్శి చెట్టి వినయ్, మన్య ప్రగతి చారిటబుల్ ట్రస్టు చైర్మన్ చెట్టి వికాస్‌లను ఆలయ కమిటీ, ఉత్సవ కమిటీ సభ్యులు సాదరంగా ఆహ్వానించారు. వైస్ ఎంపీపీ రామన్న, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రమేష్, ఆలయ కమిటీ ఉత్సవ కమిటీ చైర్మన్‌లు రఘునాథ్, అప్పలరాం, నాయకులు రామారావు, అర్జున్, గోపాల్, బాలకృష్ణ, రాంబాబు, మోహన్ తదితరులు పాల్గొన్నారు. పూజలకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారానికి చర్యలు



వంచులలో వినతులు పరిశీలిస్తున్న తహసీల్దార్ రాజ్‌కుమార్

గూడెంకొత్తవీధి: గ్రామస్థాయిలో రెవెన్యూ సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని తహసీల్దార్ రాజ్‌కుమార్ అన్నారు. వంచుల, మొండిగెడ్డ పంచాయతీల్లోని పలు గ్రామాల్లో ఆయన బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా గిరిజనుల నుంచి వినతులు స్వీకరించారు. సత్వరమే వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపడతామన్నారు. సిబ్బంది పాల్గొన్నారు.

త్రిపురాంతక స్వామి కల్యాణం రేపు

కశింకోట : స్థానిక శివాలయంలో 5న వైశాఖ పౌర్ణమి పురస్కరించుకుని సర్వమంగళాంబ సమేత త్రిపురాంతకస్వామి వార్షిక కల్యాణోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకుడు వెలవలపల్లి వెంకట సూర్య శంకరం బుధవారం తెలిపారు. సాయంత్రం 6.30 గంటలకు స్వామి, దేవేరిలల ఉత్సవ విగ్రహాలకు వేద మంత్రాల నడుమ శాస్త్రోక్తంగా కల్యాణం జరపనున్నట్లు వెల్లడించారు. 10న రాత్రి 7 గంటలకు స్వామి వారి పుష్పాంజలి కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

8 నుంచి వేసవి విజ్ఞాన శిబిరం

మాడుగుల రూరల్ : మాడుగుల శాఖా గ్రంథాలయంలో ఈ నెల 8 నుంచి వేసవి విజ్ఞాన శిబిరాన్ని ఏర్పాటు చేయనున్నట్లు గ్రంథాలయాధికారి వై.వెంకటేశ్వర్లు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరం వచ్చే నెల 11 వరకు కొనసాగుతుందన్నారు. ప్రతి రోజు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కథలు చెప్పడం, పుస్తక పఠనం, సమీక్షలు, చిత్రలేఖనం, పేపర్ ఆర్ట్, థియేటర్ ఆర్ట్స్ వంటి సృజనాత్మక కార్యక్రమాలు ఉంటాయన్నారు.

విస్తారంగా వేరుశనగ సాగు

- మత్స్యగెడ్డ పరివాహక ప్రాంతంలో పంట
- సాగుకు అనుకూలించిన వాతావరణం
- దిగుబడిపై ఆశాభావంలో రైతులు



పెద్దపేట గ్రామంలో వేరుశనగ పైరు

ముంచంగిపుట్టు: మత్స్యగెడ్డ పరివాహక ప్రాంతంలో గిరిజనులు విస్తారంగా వేరుశనగ పంట సాగును చేస్తున్నారు. పంటకు వాతావరణం సైతం అనుకూలించడంతో సాగు పనుల్లో గిరిజన రైతులు నిమగ్నమయ్యారు. ముంచంగిపుట్టు మండలంలో ప్రతి ఏడాది ఏప్రిల్, మే నెలల్లో దార్రెల, సుజనకోట, పెదగూడ, వనుగుమ్మ, పనసపుట్టు, మాకవరం, దొడిపుట్టు పంచాయితీల్లో వందల ఎకరాల్లో గిరిజనులు వేరుశనగ పంటను వేస్తారు. గతంలో అప్పులు చేసి పంట వేసే గిరిజనులకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆర్థిక చేయూత ఇవ్వడం, రాయితీపై విత్తనాలు అందుబాటులో ఉంచడం రైతులకు కలిసోచ్చింది. దీంతో ఒక్క ఏడాదిలో గిరిజన రైతులు రెండు దఫాలు వేరుశనగ పంటను పండిస్తున్నారు. దీనికి తోడు వర్షాకాలంలోనే కాకుండా ఎండాకాలంలోనూ చెదురుముదురుగా వర్షాలు కురవడంతో రైతులకు అన్ని విధాలా కలిసి వచ్చినట్లయింది. వర్షాలు పడని పక్షనా మత్స్యగెడ్డ నీటిని వినియోగిస్తూ పంటను పండిస్తున్నారు. ప్రస్తుతం మత్స్యగెడ్డ పరివాహక గిరిజన గ్రామాల్లో గిరిజనులు వేరుశనగ పంటను సాగు చేసే పనిలో నిమగ్నమై ఉన్నారు. వేరుశనగ పంట పొలాల్లోనే ఉంటూ ఎరువులు జల్లుతూ, నీటిని సాగుకు పెడుతూ కుటుంబసమేతంగా కష్టపడుతున్నారు. కొన్ని గ్రామాల్లో ఇప్పటికే వేరుశనగ పంట చేతికి రావడంతో వేరుశనగను ఉడకబెట్టి వారపు సంతలకు తీసుకువెళ్లి సంతలో గ్లాసు లెక్క రూ.20 నుంచి రూ.50 వరకు గిరి రైతులు అమ్మకాలు చేపడుతున్నారు. దీంతో పాటు పచ్చి వేరుశనగ సైతం బస్తాల లెక్క అమ్మకాలు చేస్తున్నారు. వీటిని కోనుగోలు చేసేందుకు మైదాన ప్రాంతంతో పాటు ఒడిశా రాష్ట్రం నుంచి వ్యాపారులు వచ్చి అధికంగా కొనుగోలు చేస్తు వేరుశనగను లారీలు, వ్యానులలో తరలిస్తున్నారు. వేరుశనగ సాగు పెరగడం, ఆర్థిక ఇబ్బందుల నుంచి వేరుశనగ ఆదుకుంటుందని వేరుశనగ రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

రెండుసార్లు సాగు

మత్స్యగెడ్డ సమీప గ్రామం కావడం వేరుశనగ పంటను ఏడాదిలో రెండుసార్లు సాగు చేస్తున్నాం. ఆర్థిక ఇబ్బందులతో అవస్థలు పడుతున్న మాకు వేరుశనగ పంట ఆదుకుంటూ వస్తుంది. ప్రభుత్వం అందించిన రైతు భరోసా సోమ్మును పెట్టుబడి పెట్టి సాగు చేస్తున్నాం. లాభాలు బాగా వస్తున్నాయి. మండలంలో జరిగే వారపు సంతకు తీసుకువెళ్లి అమ్మకాలు చేస్తున్నాం.

–కె.రామారావు, గిరిజన రైతు, పెద్దపేట గ్రామం, ముంచంగిపుట్టు మండలం

రైతులకు అవగాహన

రైతులకు వేరశనగ పంట సాగుపై అవగాహన కల్పిస్తున్నాం. ఏడాదిలో రెండు సార్లు వేరుశనగ పంటను వేస్తున్న రైతులకు దిగుబడిపై పలు సూచనలు చేస్తే దానికి అనుగుణంగా పంటలు వేశారు. దిగుబడితో పాటు ఆర్థికంగా లాభాలు పొందుతున్నారు. రైతు భరోసా సొమ్ము సైతం రైతులకు ఉపయోగపడింది.

– పి. మోహన్‌రావు, వ్యవసాయ శాఖ అధికారి, ముంచంగిపుట్టు

బిందు, తుంపర సేద్యంపై అవగాహన



అయ్యవారిగూడెంలో స్ప్రింకర్ల నాణ్యతను పరిశీలిస్తున్న హెచ్‌వో రమేష్

కూనవరం: రైతులు బిందుసేద్యం, తుంపర్ల సేద్యం పట్ల అవగాహన పెంపొందించుకోవాలని రంపచోడవరం ఉద్యానవన అధికారి ఎస్.రమేష్ అన్నారు. కూనవరం, ఎటపాక మండలాల్లో చేపట్టిన బిందు సేద్యానికి సంబంధించిన పరికరాల నాణ్యతను ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్ట్(ఏపీ ఎంఐపీ) ద్వారా ప్రభుత్వం బిందుసేద్యాన్ని ప్రోత్సహిస్తుందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇందులో భాగంగా డ్రిప్ స్పింకర్లు ఇతరత్రా పరికరాలపై ప్రభుత్వం రాయితీ ప్రకటించిందన్నారు. ఐదు ఎకరాల లోపు ఉన్న రైతులకు డ్రిప్ వ్యవసాయానికి 90 శాతం సబ్సిడీ, ఐదు ఎకరాలు పైబడిన రైతులకు 55 శాతం సబ్సిడీపై పరికరాలు అందజేస్తోందన్నారు. స్పింక్లర్లు అయితే ఐదు ఎకరాల రైతులకు 55 శాతం సబ్సిడీ, ఐదు ఎకరాలు పైబడిన వారికి 45 శాతం సబ్సిడీ అందజేస్తుందన్నారు. ఆయా డ్రిప్ పరికరాల కోసం రైతులు సమీప రైతు భరోసా కేంద్రాల్లో రిజిస్టేషన్ చేయించుకోవాలని సూచించారు.

తొలగిన కష్టాలు.. ఆనందంలో వాహనచోదకులు



రాజేంద్రపాలెంలో రోడ్డు (నాడు)



మరమ్మతులు పూర్తయిన రోడ్డు (నేడు)

కొయ్యూరు: కాకరపాడు–కొయ్యూరు రహదారికి రూ.25 లక్షలతో ప్యాచ్ వర్క్ పూర్తి చేయడంతో వాహనదారులకు కష్టాలు తొలగాయి. గోతులు పూర్తిగా పూడ్చడంతో పాటు కొన్నిచోట్ల పాత రోడ్డును తవ్వి కొత్తగా వేశారు. దీంతో ఇబ్బందులు తగ్గాయి.

రాజేంద్రపాలెంలో కూరగాయల షాపు వద్ద పెద్ద గొయ్యి ఏర్పడి వర్షం కురిస్తే నీరు నిల్వ ఉండిపోయేది. ఇప్పుడు రోడ్డు బాగు చేయడంతో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంతంగా రాకపోకలు సాగిస్తున్నామని వాహనచోదకులు చెబుతున్నారు. మన్యంలో రహదారులు బాగుపడడంతో, రవాణా కష్టాలు తీరాయని గిరిజనులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ తగదు



రాస్తారోకో చేస్తున్న అఖిల పక్షం నాయకులు

అరకులోయ రూరల్: మండల కేంద్రంలో సీపీఎం, కాంగ్రెస్ నాయకులు కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా బుధవారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కిల్లో సురేంద్ర మాట్లాడుతూ విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ యోచనను కేంద్ర ప్రభుత్వం విరమించుకోవాలన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను కేంద్ర ప్రభుత్వం ప్రవేటీకరణ చేయడం దారుణమన్నారు. పెట్రోల్, డీజిల్‌తో పాటు నిత్యావసరాల ధరల పెంచుతుండడంతో ప్రజలకు మరింత భారం పెరుగుతోందన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు అన్ని వర్గాల ప్రజలు వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి శాంతకుమారి, సీఐటీయూ ప్రతినిధులు ఉమామహేశ్వరరావు, పోతురాజు, నాయకులు, రామారావు, రామన్న, గంగులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా షిర్డీసాయి మందిర వార్షికోత్సవం



మాడుగులలో షిర్డీ సాయిని దర్శించుకుంటున్న భక్తులు

మాడుగుల : నియోజకవర్గ కేంద్రం మాడుగులలో షిర్డీసాయి మందిర 24వ వార్షికోత్సవం బుధవారం అత్యంత వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలతో పాటు, సత్యవ్రతాల్లో భక్తులు పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణంలో కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు. సాయంకాలం పల్లకీ ఊరేగింపు నిర్వహించారు. గ్రామస్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ శ్రీనాదు శ్రీనివాసరావు, ఆలయ కమిటీ అధ్యక్షులు ఉష, మద్దులు సత్యనారాయణ, సమ్మంగి జగన్ తదితరులు పాల్గొన్నారు.

దుర్గాలమ్మ ఆలయ మండపానికి భూమి పూజ

చీడికాడ : మండలంలోని దండిసురవరం దుర్గాలమ్మ గుడి మండప నిర్మాణానికి బుధవారం ఎంపీపీ కురచా జయమ్మ, సర్పంచ్ కోన అర్జున చేతుల మీదుగా బుధవారం భూమిపూజ చేశారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ గ్రామస్తులంతా కలిసి డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయడును కలిసి దుర్గాలమ్మ గుడి మండప నిర్మాణానికి సాయం కోరినట్టు తెలిపారు. స్పందించిన డిప్యూటీ సీఎం రూ.5 లక్షలు మంజూరు చేసినట్టు వెల్లడించారు. జిల్లా రైతు విభాగం అధ్యక్షులు అప్పారావు, వైస్ ఎంపీపీ స్వాతికొండబాబు, మండల అధ్యక్షుడు రాజుబాబు, స్వామినాయుడు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మోదకొండమ్మ పండగ రాట



కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

మాడుగుల : ఉత్తరాంధ్ర ఇలవేల్పు మాడుగుల మోదకొండమ్మ పండగరాట మహోత్సవం మహారాజులుకోట ఆవరణలో ఉన్న సతకంపట్టు వద్ద బుధవారం అత్యంత వైభవంగా జరిగింది. ఈ నెల 9న అమ్మవారి కొలువు ఏర్పాటు చేయనున్నట్టు ఆలయ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు తెలిపారు. ఎంపీపీ రామధర్మజ, సర్పంచ్ కళావతి, ఉపసర్పంచ్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఉజ్జీవ కూటములు

పెదబయలు: మండల కేంద్రంలోని ఎల్‌ఎఫ్ఎల్ చర్చిలో మూడు రోజుల పాటు ఉజ్జీవ కూటములు నిర్వహించనున్నట్టు పాస్టర్ సీహెచ్.అబ్రహాం తెలిపారు. చర్చిలో ఈనెల 4 నుంచి 6వ తేదీ వరకు జరగనున్న కార్యక్రమంలో ప్రసంగీకులు కాకినాడ నుంచి బ్రదర్ స్టీఫెన్ సత్యం, పేరవరం నుంచి ఇమ్మానుయేలు, నక్కపల్లి నుంచి సుధాకర్ హాజరవుతారని పేర్కొన్నారు. రోజు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు, సాయంత్రం 6 నుంచి 9.30 గంటల వరకు నిర్వహించనున్నట్టు తెలిపారు. కూటములకు వచ్చిన వారికి భోజన సదుపాయం కల్పిస్తున్నట్టు తెలిపారు.

వలంటీర్ల నియామకానికి ఇంటర్వ్యూలు

చింతపల్లి: మండలంలోని కొత్తపాలెం, కుడుమసారి పంచాయతీల్లో ముగ్గురు వలంటీర్ల నియామకానికి సంబంధించి బుధవారం ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు ఎంపీడీవో లాలం సీతయ్య తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకున్నవారికి ఇంటర్వ్యూలు నిర్వహించి నియామకపత్రాలు అందజేశామన్నారు. కొత్తపాలెం పంచాయతీలో–ఇద్దరు, కుడుమసారిలో–ఒకరు నియమించినట్టు తెలిపారు. కార్యాలయం పరిపాలన అధికారి రవీంద్ర పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రంపచోడవరం: మండల కేంద్రంలోని 33/11 కె.వి సబ్ స్టేషన్ పరిధిలో ఫీడర్ మరమ్మతుల నిమిత్తం ఈనెల 5వ తేదీన విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు విద్యుత్‌శాఖ ఈఈ ఎండీ యూసఫ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రంపచోడవరం సబ్ స్టేషన్‌కు సంబంధించి రంపచోడవరం, సిరిగిందలపాడు గ్రామాల్లో శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

8, 9 తేదీల్లో యూటీఎఫ్ శిక్షణ తరగతులు

వీఆర్ పురం: రంపచోడవరంలో ఈనెల 8, 9 తేదీల్లో నిర్వహించనున్న యూటీఎఫ్ ఉద్యమ శిక్షణ తరగతులకు సభ్యులంతా హాజరై విజయవంతం చేయాలని ఫెడరేషన్ జిల్లా సభ్యురాలు ఎం.కవిత పిలుపునిచ్చారు. మండల పరిధి సున్నంవారిగూడెం గ్రామంలో బుధవారం నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడారు. కాకినాడ యూటీఎఫ్ భవన్‌లో 7వ తేదీన నిర్వహించనున్న వర్క్‌షాప్‌ను కూడా జయప్రదం చేయాలని ఆమె కోరారు. ఐటీడీఏ సబ్ కమిటీ సభ్యుడు యు.వెంకటనారాయణ, నాయకులు పి.కన్నారావు ,ఎస్.జగదీష్, బి.ముత్తయ్య, ఎం.రాంబాబు, కుర్సం బ్రహ్మయ్య,కె.తులసీ, నాలుగు మండలాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి పర్యటన

గూడెంకొత్తవీధి: మండలకేంద్రంలో పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి గురువారం పర్యటించనున్నట్టు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు లక్ష్మణ్ తెలిపారు. గడపడ గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి గూడెంకొత్తవీధి సచివాలయం –1 పరిధిలోని రామాలయం వీధి, కొత్తపాకలులో పర్యటిస్తారన్నారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పార్టీ నాయకులు హాజరుకావాలని ఆయన కోరారు.

రోడ్డు పనులు పూర్తి చేయరూ..

అనంతగిరి: మండలంలోని గుమ్మకోట పంచాయతీ గుమ్మకోట–శంకుపర్తి వరకు నిర్మాణంలో ఉన్న రహదారి అటవీ అడ్డంకులతో నిలిచిపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, ఆయా గ్రామాల గిరిజనులు బుధవారం మోకాళ్లపై వినూత్నంగా ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ అప్పారావు మాట్లాడుతూ రహదారి పూర్తి కాకపోవడంతో ఆయా గ్రామాల్లో గిరిజనులు డోలీమోతపై తరలించాల్సిన దుస్థితి నెలకొందన్నారు. తక్షణమే రహదారి నిర్మాణానికి చర్యలు చేపట్టాలని కోరారు.

సంక్షేమ బాటలో గిరి గ్రామాలు



కుబిరిపాడలో గ్రామస్తులకు బ్రోచర్‌ను అందజేస్తున్న మండల పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్

ముంచంగిపుట్టు: మాకవరం పంచాయతీ కుబిరిపాడ గ్రామంలో జగనన్నే మా భవిష్యత్తు.. మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ నేతలు బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పాంగి మల్లికార్జున్ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సంక్షేమ బాటలో గిరిజన గ్రామాలు పయనిస్తున్నాయన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించి, జగనన్న స్టిక్కర్లు అతికించారు. ఈ సందర్భంగా మల్లికార్జున్ మాట్లాడుతూ ప్రభుత్వం గిరిజన ప్రాంత అభివృద్ధి కోసం కోట్లాది రూపాయల నిధులు మంజూరు చేస్తోందన్నారు. నాడు–నేడు ద్వారా పాఠశాలలకు అన్ని మౌలిక సదుపాయాలు కల్పించి, గిరిజన విద్య వ్యవస్థను పటిష్టం చేసిందన్నారు. రానున్న రోజుల్లో సమస్యలే లేని గిరిజన గ్రామాలుగా తీర్చిదిద్దడమే లక్ష్యం అన్నారు. సర్పంచ్‌లు గంగాధర్, నీలకంఠం, నాయకులు తిరుపతిరావు, జయదేవ్, భగత్‌రాం తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి ఉత్సవాలకు ముహూర్తపు రాట



ముహూర్తపు రాట వేస్తున్న సర్పంచ్ పూర్ణిమ, ఎంపీటీసీ రమ, ఉత్సవ కమిటీ సభ్యులు

హుకుంపేట: గిరిజనుల ఆరాధ్యదైవం మోదకొండమ్మ అమ్మవారి ఆశీసులు ప్రతి ఒక్కరికి ఉంటుందని సర్పంచ్ సమిడ వెంకటపూర్ణిమ, ఎంపిటీసీ కొమ్మ రమలు అన్నారు. మండల కేంద్రంలో ఈనెల 7, 8, 9 తేదీల్లో నిర్వహించనున్న మోదకొండమ్మ ఉత్సవాలకు సంబంధించి ముహూర్తపు రాట వేడుక బుధవారం ఘనంగా జరిగింది. సతకం పట్టులో డప్పు వాయిద్యాలు, థింసా నృత్యాల నడుమ సర్పంచ్ సమిడ వెంకటపూర్ణిమ, ఎంపీటీసీ సభ్యురాలు కొమ్మ రమ ఉత్సవ ముహూర్తపు రాట వేశారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమ్మవారి జాతరకు అన్ని ఏర్పాట్లు చేయాలని, పండగను ఘనంగా నిర్వహించాలన్నారు. మాజీ జెడ్పీటీసీ సభ్యురాలు కొర్ర కాసులమ్మ, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు అనిల్, సభ్యులు గోవింద్, దుర్గప్రసాద్, వెంకట్, సూర్యకాంతం తదితరులు పాల్గొన్నారు.

పశువ్యాధులపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీ గణేశ్వరరావు

డుంబ్రిగుడ: గ్రామాల్లో పశువ్యాధులపై గిరిజన రైతులకు అప్రమత్తంగా ఉండేలా సిబ్బంది రైతులకు అవగాహన కల్పించాలని పశుసంవర్ధక శాఖ ఏడీ సాగర గణేశ్వరరావు అన్నారు. మండల కేంద్రంలోని పశు సంవర్ధకశాఖ కార్యాలయాన్ని ఆయన బుధవారం సందర్శించారు. రికార్డులు తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ సిబ్బంది గ్రామాల్లో పర్యటించి పశువులకు సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ముందస్తుగా గ్రామాల్లో పశు వైద్య శిబిరాలు నిర్వహించాలని సూచించారు. పశువులకు ఎటువంటి వ్యాధులు సోకిన వెంటనే వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. సిబ్బంది సాంబశివరావు, దివ్య, త్రినాథరావు, అనంత్‌రావు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటల సాగుకు ప్రతిపాదనలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో బాపన్నదొర

అడ్డతీగల: మండల వ్యాప్తంగా ఉపాధి హామీ పథకం కింద రోజుకి 5వేల మందికి పని కల్పించాలని ఎంపీడీఓ కె.బాపన్నదొర అన్నారు.స్థానిక ఉపాధిహామీ కార్యాలయంలో బుధవారం ఉపాధి హామీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023–2024 సంవత్సరానికి ఉద్యానవన రైతులను ప్రోత్సహించడానికి ఆయా రైతులను గుర్తించాలన్నారు.500 ఎకరాల్లో ఉద్యాన పంటలు పెంపకానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. 2022–2023 ఆర్థిక సంవత్సరానికి చేసిన ఉపాధి హామీ పనుల పరిశీలనకు సామాజిక తనిఖీ నిర్వహణ బృందాలకు రికార్డులు అప్పగించాలన్నారు. వ్యవసాయాధికారి ఎం.సువర్ణకుమారి, ఉపాధి హామీ ఏపీవో మణికుమారి, వ్యవసాయ సహాయకులు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు, టెక్నికల్ అసిస్టెంట్‌లు, జేఈలు, సీవోలు పాల్గొన్నారు.

జనసంచారంలోకి కొండగొర్రె



అటవీశాఖ సిబ్బందికి కొండగొర్రెను అప్పగించిన డాక్టర్ మధు

రంపచోడవరం: అటవీ ప్రాంతం నుంచి దారి తప్పిన కొండగొర్రె జనసంచారంలోకి బుధవారం వచ్చింది. మండల కేంద్రంలోని ఏరియా ఆసుపత్రి వెనుక వైపు నుంచి లోపలకు వచ్చేందుకు ప్రయత్నించిన కొండ గొర్రె గేటులో ఇరుక్కుంది. దీన్ని గమనించిన రోగి శివ ఆస్పత్రి సిబ్బందికి సమాచారం అందించారు. దీంతో డాక్టర్ మధు వెంటనే స్పందించి సిబ్బంది నాగేశ్వరరావు సహాయంతో గేటులో ఇరుక్కున్న కొండగొర్రెను బయటకు తీయించారు. దానిని ఆటోలో తీసుకువెళ్లి రంపచోడవరం అటవీశాఖ కార్యాలయంలో ఎఫ్ఎస్ఓ సమక్షంలో సిబ్బందికి అప్పగించారు. దీంతో అటవీ సిబ్బందిని కొండగొర్రెను సమీపంలోని సున్నంపాడు అటవీ ప్రాంతంలో వదిలిపెట్టారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహాల ప్రతిష్ట



పి.ఎస్.ఆర్ పేటలో దుర్గాదేవి విగ్రహాల ఊరేగింపులో పాల్గొన్న గ్రామస్తులు

రాంబిల్లి: అప్పన్నపాలెంలో బుధవారం వినాయకుడు, శ్రీకృష్ణుడు విగ్రహాల ప్రతిష్ట కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఇక్కడ గల ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో వినాయకుడు, శ్రీకృష్ణుడి విగ్రహాలను శాస్త్రోక్తంగా ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. కోలాటాలు ఎంతో ఆకట్టుకున్నాయి. సర్పంచ్ రుత్తల పైడిరత్నం, ఎంపీటీసీ లాలం చిననత్యం, గ్రామ నాయకులు రుత్తల గణేష్ పాల్గొన్నారు.

యలమంచిలి : మండలంలో పి.ఎస్.ఆర్‌పేట, పేట బయ్యవరం గ్రామాల్లో శ్రీశ్రీశ్రీ దుర్గాదేవి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. రెండు గ్రామాల ప్రజల ఆర్థిక సహాయంతో నూతనంగా దుర్గాదేవి ఆలయాల నిర్మాణం పూర్తి చేసుకుని ఈనెల 3వ తేదీ నుంచి 5వ తేదీ వరకు అమ్మవారి ఆలయం వద్ద విశేష పూజలు నిర్వహించారు. వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించారు. బుధవారం సాయంత్రం రెండు గ్రామాల పురవీధుల్లో అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని, అమ్మవారి పాదాలు, కిరీటం, గరగలు మహిళలు ఊరేగించారు. ఆలయాన్ని పూలతో అలంకరించారు. ఆయా కార్యక్రమాల్లో గొన్నాబత్తుల శివలక్ష్మి, శివ, మొగలపల్లి వెంకట సత్యనారాయణ, గోవిందరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు శేఖర్, నారాయణరావు, జెర్రిపోతుల వెంకట్ పాల్గొన్నారు.

నేడు అమ్మవారి జాతర

ఎస్.రాయవరం : బంగారమ్మతల్లి పండగను ఘనంగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. గురువారం ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయనున్నారు. గ్రామ పురవీధుల్లో విద్యుదలంకరణలతో అందంగా తీర్చిదిద్దారు. జాతర పురస్కరించుకుని ఉత్సాహంగా క్రికెట్ పోటీలు నిర్వహించారు.